సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



తీరులోనూ ఆదర్శమే..!

కొండములగాం ఆదర్శ పాఠశాల తీరులోనూ ఆదర్శంగా నిలుస్తోంది. అత్యద్భుత ఫలితాలు సాధిస్తోంది.

- 8లో



క్షేత్ర పాలకా..నీదే భారమిక

ముఖలింగేశ్వరుని క్షేత్ర పాలకుని ఆలయంలో భద్రత కొరవడింది. సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

- 8లో

బాల్య వివాహం నిలుపుదల

సారవకోట: మండలంలోని కిడిమి పంచాయతీ భద్రాచలం గ్రామంలో బాల్య వివాహాన్ని అధికారులు శనివారం నిలుపుదల చేశారు. ఈ వివాహంపై చైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఎంపీడీఓ రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, చైల్డ్‌లైన్ సిబ్బంది గ్రామానికి వెళ్లి పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు బాల్య వివాహం వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాల గురించి వివరించి పెళ్లి ఆపారు.

న్యూస్‌రీల్

డిగ్రీ సప్లిమెంటరీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ సప్లిమెంటరీ రెండో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. 2020, 2021, 2022 బ్యాచ్‌ల విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. 6011 మంది విద్యార్థులు 12597 సబ్జెక్టుల్లో పరీక్షలు రాశారు. 7416 సబ్జెక్టు పేపర్లతో ఉత్తీర్ణత సాధించారు. 58.87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో రిజల్ట్ అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్ అవసరయ్యే విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిలువునా వణికిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

శ్రీకాకుళం క్రైమ్ : ఏఐ.. సైబర్ నేరగాళ్ల చేతిలో ఆయుధంలా మారింది. సామాన్యులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతమేర ఉపయోగపడుతుందో గానీ.. సైబర్ నేరగాళ్లు మాత్రం దీన్ని వాడుకుని డబ్బులు గుంజుతున్నారు. ఫొటోలను మార్ఫింగ్ చేయడం, మహిళలను టార్గెట్ చేసుకుని వారి నకిలీ నగ్న చిత్రాలు తయారు చేసి బెదిరించడం వంటి ఘటనలు జిల్లాలోనూ జరుగుతున్నాయి. ఇటీవల ఓ అధికారిణి కూడా దీని బారిన పడ్డారు. ఒక తెలియని నంబర్ నుంచి వచ్చిన వీడియో కాల్ లిఫ్ట్ చేసి మాట్లాడిన పాపానికి.. అవతలి వ్యక్తి ఏఐ సాయంతో నగ్న చిత్రాలు తయారు చేసి బెదిరించేంత వరకు విషయం వెళ్లింది. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు కోరుతున్నారు.

వయనాడ్ వరద బాధితులకు ఆర్థిక సాయం



వయనాడ్ బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న డబ్బులు చూపిస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వయనాడ్ వరద ప్రమాద బాధితులకు సీపీఎం ఆర్థిక సాయం అందిస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గసభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు శ్రీకాకుళం జిల్లాలో సేకరించిన రూ.59,650లను కేరళ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ యువ సమ్మేళనానికి జిల్లావాసి



యువ సమ్మేళనంకు బయల్దేరిన సూర్య

శ్రీకాకుళం అర్బన్: ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో చెన్నైలో రెండు రోజులు పాటు జరగనున్న జాతీయ యువ సమ్మేళనంకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఎ.సూర్య హాజరుకానున్నారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం నుంచి చెన్నైకు సూర్య బయల్దేరగా ఆయనకు యూనియన్ రీజనల్ కార్యదర్శి బి.శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. మొదటిసారిగా శ్రీకాకుళం జిల్లా నుంచి యువ సమ్మేళనానికి సూర్య ఎంపిక కావడంపై యూనియన్ తరపున రీజినల్ కార్యదర్శి శ్రీనివాసులు, యూనియన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మెట్టవలసలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్, సున్నం కలిపి రోడ్లపై వేసిన దృశ్యం



పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారం తొలగిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

జి.సిగడాం: మెట్టవలస గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. 80 మంది పారిశుద్ధ్య కార్మికులు, 30 మంది పంచాయతీ కార్యదర్శులు, మూడు యంత్రాలు, 5 ట్రాక్టర్లు ఇతర సిబ్బందితో గ్రామమంతా పనులు చేపడుతున్నారు. శనివారం డీపీఓ వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాస రావు, స్థానిక సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథం పనులు పర్యవేక్షించారు.



సవర జాడుపల్లి గ్రామం వద్ద పండ్లను విక్రయిస్తున్న గిరిజన మహిళలు

కొండపై పండిన అరటి



ఆహా ఏమి రుచి..

కొనరా మైమరచి



- నవరజాడుపల్లిలో గిరిజనుల ప్రత్యేక శైలి
- రోడ్డు పక్కన తక్కువ ధరకే పండ్ల విక్రయం
- రసాయనాలు వాడని ఈ పండ్లకు అభిమానులెందరో

మెళియాపుట్టి:

చుట్టూ అమ్మ లాంటి అడవి. మధ్యలో పాపిడి తీసినట్టుగా తారు దారి. అప్పుడొకటీ.. ఇప్పుడొకటీ అన్నట్టుగా వెళ్లే వాహనాలు. మెళియాపుట్టి మండలంలోని నవరజాడుపల్లి వద్ద కనిపించే దృశ్యమిది. ఇలాంటి దృశ్యాలే కాదు.. అక్కడ విక్రయించే ఫలాలు చాలా ప్రత్యేకం. సీతాఫలం, జామ, అరటి, పనస, అనాస, బొప్పాయి వంటి పండ్లను రోడ్ల పక్కన విక్రయిస్తారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా పోడు సాగులో పండించే ఈ పండ్ల రుచి అత్యద్భుతంగా ఉంటుందని వాహన దారులు చెబుతుంటారు. ఎలాంటి ఆడంబరాలు లేకుండా చిన్న పాక లాంటి దుకాణంలో తక్కువ ధరకే వీటిని విక్రయిస్తుంటారు. కర్ర పెండలం దుంపలు, వాడంబరాల పూలు కూడా అమ్ముతుంటారు. ప్రకృతి ప్రసాదించే ఈ ఫలాలే తమకు జీవనోపాధి అని గిరిజనులు చెబుతుంటారు. ఇటుగా వెళ్లేవారెవరైనా ఈ దుకాణాల వద్ద ఆగి పండ్లను కొని తినాల్సిందే.



చెట్టుపై ఉన్న పనస పండ్లను చూపిస్తున్న గ్రామస్తుడు

ఇవే కాకుండా సీజన్‌లో మామిడి, జీడి పంటలు కూడా వారు పండిస్తారు. ముఖ్యంగా ఇక్కడి అరటి పండ్లు చాలా రుచిగా ఉంటాయని తిన్నవారు చెబుతుంటారు. ప్రభుత్వ సహకారం అందితే కమల, బత్తాయి, దానిమ్మ, నిమ్మ లాంటి తోటల పెంపకానికి అవకాశం ఉంటుందని అక్కడి గిరిజనులు చెబుతున్నారు.

ప్రతి రోజూ విక్రయిస్తాం..



మా గ్రామంలో సుమారుగా అన్ని కుటుంబాలు అడవిపై ఆధారపడి జీవనం పొందుతున్నాం. మా పోడు భూముల్లో ఎలాంటి ఎరువులు లేకుండా పండించి అమ్ముతాము. నాకున్న కొద్దిపాటి పోడుభూమిలో బొప్పాయి, పనస, అరటి తోటలు వేసుకున్నాను.

– సవర శాంతమ్మ, సవర జాడుపల్లి గ్రామం

పోడు వ్యవసాయమే ఆధారం



పోడు భూములు మాకు దైవం లాంటివి. మా గ్రామానికి చాలామంది వచ్చి పంటలు కొంటూ ఉంటారు. కొన్ని రకాల పండ్లు రహదారి పక్కన విక్రయిస్తుంటాం. ఏదో ఒక ధరకి విక్రయించడమే మాకు తెలుసు. అధికారులు, ప్రభుత్వ సహకారం అందిస్తే బాగుంటుంది.

– సవర సరస్వతి, సవర జాడుపల్లి గ్రామం

మిగులు సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్



ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో మిగులు సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు యూనిట్‌గా ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్‌కు సంబంధించి జనరల్ కేటగిరీ సీట్లు 1035 ఉండగా మొదటి కౌన్సెలింగ్‌లో 863 ప్రవేశాలు జరగ్గా, రెండో కౌన్సెలింగ్‌లో 123 ప్రవేశాలు జరిగాయి. 49 సీట్లు మిగిలిపోయాయి. ప్రస్తుతం మూడో విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం రెండు కౌన్సెలింగ్‌లలో సీట్లు లభించిన విద్యార్థులు మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ప్రస్తుతం సీట్లు వచ్చిన క్యాంపస్ నుంచి మార్పునకు అవకాశం కల్పించారు. మెరిట్ లిస్ట్‌లో సీటు లభించి హాజరు కాని విద్యార్థులు ప్రవేశం కోసం ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే ప్రవేశాలకు వారిని పరిగణనలోకి తీసుకోరు. క్యాంపస్‌ల మార్పు, హాజరు కాని మెరిట్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ అనంతరం ఖాళీ బట్టి ప్రస్తుతం ఉన్న మెరిట్ లిస్ట్‌ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఒంగోలు క్యాంపస్‌లో సీటు లభించిన విద్యార్థులు శ్రీకాకుళం క్యాంపస్‌కు ఆప్షన్లు ఎక్కువ మంది ఇచ్చుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ తర్వాత మూడో మెరిట్ లిస్ట్, కౌన్సె లింగ్ షెడ్యూల్ ప్రకటించనున్నారు. ఇప్పటికే అధికారులు ప్రీ యూనివర్సిటీ కోర్సు ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో సెల్ఫ్ రిపోర్టు చేయాలని, 21 నుంచి క్లాస్ వర్కు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రంలో దుష్టపాలన సాగుతోంది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట:

ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దుష్టపాలన కొనసాగుతోందని, ఈ రెడ్ బుక్ రాజ్యాంగం ఇంకెన్నాళ్లు సాగదని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అంబేడ్కర్ సామాజిక మహాశిల్పంపై దాడి ఘటనకు నిరసనగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం సాయంత్రం నరసన్నపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ వారు ప్రతి రోజూ ఏదో ఒక చోట విధ్వంసం సృష్టిస్తున్నారని, మరీ మిడిసి పడిపోవాల్సిన అవసరం లేదని అన్నారు. సామాజిక మహాశిల్పంపై దాడి చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలని కోరారు. పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.

సామాన్యులకు రక్షణ ఎక్కడ

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. విజయవాడలోని స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం సాయంత్రం పట్టణంలోని బస్టాండ్ కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్ గుండా దాసన్న పేట కూడలి మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో ప్రత్యేకంగా నిలిచిన స్మృతివనంలో ఈ దుశ్చర్యకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. వైఎస్సార్ సీపీకి మంచి పేరు రావడం ఇష్టం లేకనే టీడీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. ముందు అధికార పార్టీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు.



నరసన్నపేట మెయిన్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ

సుబ్బపేటలో డెంగీ జాడలు

- డెంగీ లక్షణాలతో ఐదుగురిని రిమ్స్‌కు తరలింపు
- ఆందోళనలో గ్రామస్తులు

సరుబుజ్జిలి: ఇస్కలపాలెం పంచాయతీ సుబ్బపేట గ్రామంలో డెంగీ జాడలు భయం పుట్టిస్తున్నాయి. ఇప్పటికే గ్రామంలో ఐదుగురు డెంగీ వ్యాధితో చికిత్స పొందుతుండగా మరికొంత మంది విషజ్వరాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే పైల సూర్యంకు డెంగీ నిర్ధారణ కావడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అలాగే యరబాటి గాయత్రి, పోలిపల్లి చిన్నమ్మడు, యరబాటి నాగేశ్వరరావు కూడా డెంగీ లక్షణాలతో బాధపడడంతో శనివారం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. అలాగే సురవరపు సూరమ్మతోపాటు మరో పదిమంది వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అడుగడుగునా పారిశుద్ధ్య లోపం

గ్రామంలో పారిశుద్ధ్య లోపం అడుగడుగునా కనిపిస్తోంది. దీని వల్లనే జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మురుగునీరు రహదారులపై రోజుల తరబడి నిల్వ చేరడం వల్ల ఈగలు, దోమలు చేరి వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి ఐదుగురికి డెంగీ లక్షణాలు కనిపించడంతో ఊరంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



డెంగీ జ్వరంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సూర్యం



కుళ్లిపోయిన పొలంలో నాట్లు వేసేందుకు నారుతీసుకుని వెళుతున్న రైతు

పంటకు నష్టం.. రైతుకు కష్టం

- వర్షాలకు పలుచోట్ల నీట మునిగిన పంట
- రోజులు గడుస్తున్నా స్పందించని పాలకులు
- తంపర రైతులకు తప్పని కష్టాలు
- సాయం లేదు.. విత్తనాలు లేవు

ఎల్ఎన్ పేట/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ఖరీఫ్ ఆరంభ దశలోనే తంపర రైతులకు కష్టకాలం ఎదురైంది. విత్తనాలు వేసుకున్న నెల రోజులకే తుఫాన్ వర్షాలు ముంచెత్తాయి. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు పలు మండలాల్లోని తంపర పంట పొలాలు నీట మునిగాయి. పది నుంచి 15 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో పంటలకు నష్టం జరిగింది. మొక్కదశలో ఉన్న వరిపంట నీట మునిగిపోవటంతో పూర్తిగా కుళ్లిపోయింది. పంటల నష్టాన్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు నివేదికలను జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జేడీల ద్వారా ప్రభుత్వానికి పంపించారు. ఈ తంతు జరిగి రోజులు గడుస్తున్నా నష్టపోయిన రైతుల గురించి ఎలాంటి ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు.

659 హెక్టార్లలో..

గత నెల 18వ తేదీ నుంచి సుమారు వారం రోజులు పాటు కురిసిన తుఫాన్ వర్షాలకు జిల్లాలో 659 హెక్టార్లల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఎల్.ఎన్.పేట మండలంలో 366 హెక్టార్లు, జలుమూరులో 160 హెక్టార్లు, గారలో 102 హెక్టార్లు, సారవకోటలో 25 హెక్టార్లు, హిరమండలంలో 6 హెక్టార్లల్లో పంట నష్టం జరిగింది. ఆయా మండలాల్లోని పల్లం (తంపర) పొలాల్లో నీరు నిలిచిపోవటం వల్ల పంటలు నీట మునిగి కుళ్లిపోయాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లోని పంట పొలాల్లో వరద నీరు తగ్గలేదని రైతులు చెబుతున్నారు. ఇంత నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి సహాయం లేదు. కనీసం విత్తనాలు కూడా ఇవ్వలేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



కోవిలాం వద్ద నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)

పక్క మండలాల్లో నారు కొనుగోలు

పంటలు నష్టపోయిన కొందరు రైతులు పక్క మండలాల్లో నారు కొనుగోలు చేసి ఆటోల్లో తీసుకుని వచ్చి నాట్లు వేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి నారు కొనుగోలు చేయటంతో పాటు కూలీలను తీసుకుని వెళ్లి నారు తీత, ఆటోల్లో తీసుకుని వచ్చేందుకు పెట్టుబడి పెరిగిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు నీట మునిగిన పంటను పరిశీలించేందుకు అధికారులు వచ్చిన నివేదించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం దురదృష్టకరమని అంటున్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలి



తుఫాన్ వర్షాల కారణంగా పెట్టుబడితో పాటు పంటను కూడా నష్టపోయాం. పది రోజుల పాటు పొలంలో నీరు నిలిచిపోవటం వల్ల పంట కుళ్లిపోయింది. తంపర పొలాలు కావటంతో ఇప్పటికీ పొలంలోనే నీరు ఉంది. పంట నష్టం జరిగిన రైతులను గుర్తించి నష్ట పరిహారం ఇవ్వాలి.

– చింతాడ ఆదినారాయణ, బాధిత రైతు, ధనుకువాడ, ఎల్ఎన్ పేట

విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



తుఫాన్ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వారిని ఆదుకునేందుకు నష్ట పరిహారం ఇవ్వాలి. కనీసం స్వల్పకాలిక విత్తనాలు, పంటకు అవసరమయ్యే ఎరువులు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి. రైతుకు నష్టం జరిగినప్పుడు ప్రభుత్వాలు ఆదుకునేందుకు ముందుకు రావాలి. పొలాల్లో నీరు ఇప్పటికీ నిలిచి ఉంది.– గున్ను కృష్ణమూర్తి, బాధిత రైతు, చింతలబడవంజ, ఎల్ఎన్ పేట

అదనపు పెట్టుబడి



ఈ ఏడాది పంట పండించేందుకు పెట్టుబడి అధికం అవుతుంది. తుఫాన్ వర్షాలకు నీట మునిగిన పంట కుళ్లిపోవటంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి నారు కొనుగోలు చేసి తీసుకుని వచ్చి నాట్లు వేస్తున్నాం. నారు కొనుగోలు, నారు తీత, ఆటోల్లో తీసుకుని వచ్చేందుకు, నాట్లు వేసేందుకు ఎకరానికి రూ.12 వేలు అదనపు పెట్టుబడి అవుతోంది. – సీపాన ముత్యాలరావు, బాధిత రైతు, తురకపేట, ఎల్ఎన్ పేట

ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే అవకాశం లేదు

నీట మునిగిన పొలాలన్నీ ఇప్పుడు నీరు లేకుండా బాగానే ఉన్నాయి. ఎల్ఎన్‌పేట ప్రాంతంలో నీట మునిగిన రైతులకు విత్తనాలు ఇస్తామంటే వద్దన్నారు. నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడే నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుంది. ప్రస్తుతం పొలాల్లో పంటలు బాగానే ఉన్నాయి.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం జిల్లా.

మంత్రి ప్రకటనలో జిల్లా ప్రస్తావనే లేదు

వర్షాలకు జిల్లాలో వందలాది హెక్టార్లల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదించారు. అయితే జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంటలు నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీపై విత్తనాలు ఇస్తామని ఈనెల 4వ తేదీన ఒక ప్రకటన చేశారు. ఈ ప్రకటనలో అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ప్రస్తావనే లేదు. అధికారులు స్పందించినా.. పాలకుల్లో స్పందన లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.



కోవిలాం వద్ద వరదల కారణంగా కుళ్లిపోయిన పంట పొలం

క్లుప్తంగా

శ్రీముఖలింగేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ ఆవరణలో భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో జిల్లా నలుమూలలతోపాటు పక్క జిల్లాలైన విజయనగరం, మన్యం, విశాఖపట్నం, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామికి తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చారు. అనంతరం వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

కుక్కల దాడిలో 50 మేకపిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

నందిగాం: సంతబొమ్మాళి మండలం అల్లాడ గ్రామం సమీపంలో కుక్కల దాడిలో సుమారు 50 మేక పిల్లలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన దుబ్బ రంగారావు అనే పాడి రైతు తన గొర్రె పిల్లలను మేత కోసం అల్లాడ జంక్షన్ వద్ద మంద వేశారు. అయితే ఆ మందపై కుక్కలు దాడి చేసి 50 మేక పిల్లలను చంపేసినట్లు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య



కొల్ల సూరి

నరసన్నపేట: మండలం నడగాంకు చెందిన కొల్ల సూరి(72) ఆత్మహత్యకు పాల్పడినట్లు నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా.. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కుటుంబంలో ఉన్న మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కగా నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... టెక్కలికి చెందిన ఏఎస్‌ఐ కేశవరావు తన ద్విచక్రవాహనాన్ని జాతీయ రహదారికి కొంచెం దూరంలో నిలిపి ఉంచారు. అయితే శనివారం వేకువజామున పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న ఒక లారీ డ్రైవర్ నిద్ర మత్తులో అతివేగంగా వచ్చి ఆ బైక్‌ను ఢీకొట్టి కొద్ది దూరం ముందుకు వెళ్లి ఆపాడు. దీంతో బైక్ నుజ్జునుజ్జయిపోయింది. లారీ ఆపకపోయి ఉంటే లారీ బోల్తా పడి ఉండేదని స్థానికులు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లారీని అదుపులో తీసుకున్నారు.

ఏపీ చిట్‌ఫండ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 'కొన్న'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ చిట్‌ఫండ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన కొన్న మధుసూదనరావు ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన చిట్‌ఫండ్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘ ఎన్నికల్లో ఈయన సీనియర్ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. వచ్చేనెల 13 నుంచి 15 వరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తమ తండ్రి స్వర్గీయ కొన్న చిన్నారావు జ్ఞాపకార్థం ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు.

నేడు జీడి కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ, మొగిలిపాడు, ఇండస్ట్రియల్, కార్మికులతో కూడి ఉన్న కాష్యూ రైస్ మిల్లర్ లేబర్ యూనియన్ ప్రత్యేక సమావేశం ఆదివారం జరుగుతుందని ఆ సంఘ గౌరవ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి తెలిపారు. పలాసలో విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సమక్షంలో రెండేళ్లకు ఒక్కసారి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు పలాస ఆంజనేయ మందిరం ఎదురుగా ఉన్న సంఘ కార్మిక భవనంలో కార్యక్రమం జరుగుతుందని అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు.

తీరులోనూ ఆదర్శమే..!

- పదో తరగతిలో అత్యున్నత ఫలితాలు సాధించిన కొండములగాం ఆదర్శ పాఠశాల
- రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక
- స్వాతంత్ర్య వేడుకలో అవార్డు ప్రదానం

రణస్థలం:

రణస్థలం మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాల మార్చి-24లో సాధించిన అత్యున్నత విజయానికి తగు సత్కారం దొరకనుంది. నాటి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కల్పించిన సదుపాయాలతో ఆదర్శ పాఠశాలలు పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఆ కోవలోనే కొండములగాం ఆదర్శ పాఠశాల కూడా శత శాతం ఫలితాలు సాధించింది. పాఠశాలలో వంద మంది చదవగా.. అందరూ పాసయ్యారు. అందులో 82 మంది విద్యార్థులు 500 మార్కులు దాటి సాధించారు. కె.శిరీష అనే విద్యార్థిని 591 మార్కులు తెచ్చుకుంది. వైఎస్ జగన్ అప్పట్లో ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణలు, అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద వంటి సదుపాయాలతో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. దీనికి తోడు నాడు-నేడుతో మరుగుదొడ్లు, పక్కా భవనాలు, విద్యా సామగ్రి, టేబుళ్లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసి బడి రూపురేఖలు మార్చేశారు. దీంతో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయి.

ట్రిపుల్ ఐటీకి 21 మంది ఎంపిక..



ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులు

టెన్త్ ఫలితాలతో పాటు ఎన్నడూ లేనంతగా ఒకే పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలకు ఎంపిక కావడం రణస్థలం విద్యా చరిత్రలో నిలిచిపోయే విషయం. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఈ 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో ప్రజాప్రతినిధులు, రణస్థలం మండల వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య వేడుకలో అవార్డు ప్రధానం

విజయవాడలో 78వ స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా అవార్డును రణస్థలం మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాల అందుకోనుంది. మార్చి-2024 పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను ఈ అవార్డు అందించున్నారు.

> **సంతోషంగా ఉంది**
>
> 
>
> రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రథమ పాఠశాలగా మా కొండములగాం ఆదర్శ పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. దీంతో మా ఉపాధ్యాయులపై బాధ్యత మరింత పెరిగింది. చక్కగా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చిన మార్చి 2024 విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు.
>
> – పి.శ్రీధర్, ప్రిన్సిపాల్

నా కుటుంబ కలహాల వెనుక అచ్చెన్న హస్తం

- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: గత రెండు రోజులుగా తన ఇంటి వద్ద జరుగుతున్న పరిణామాలతో పాటు, కుటుంబ కలహాల వెనుక మంత్రి అచ్చెన్నాయుడు ప్రమేయం ఉందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. ఆయన శనివారం టెక్కలి సమీపంలోని అక్కవరంలో తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాఘవరావు అచ్చెన్నాయుడు విజయం కోసం పని చేశారని దువ్వాడ అన్నారు. తన పిల్లలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన చెప్పారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: స్విమ్మింగ్ ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా రెండు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ స్విమ్మింగ్ చేయడం ద్వారా శరీరంలో అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుందని, అనేక వ్యాధులు నయమవుతాయన్నారు. వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించేందుకు స్విమ్మింగ్ అవసరమని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, సెక్రటరీ కె.ఝాన్సీ, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు, లైన్స్ క్లబ్ అరసవల్లి అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాథనాయుడు, అందవరపు సంతోష్, చక్రవర్తి, కోచ్ కాంతారావు, మురళీధర్, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కావాల్సి ఉండగా.. ఎమ్మెల్యే గొండు శంకర్ రెండు గంటలు ఆలస్యంగా రావడంతో క్రీడాకారులు నానా అవస్థలు పడ్డారు.

అర్ధరాత్రి పశువుల అక్రమ రవాణా

ఇచ్ఛాపురం రూరల్: గత కొంత కాలంగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం కేదారిపురం కేంద్రంగా స్థానికుల సహకారంతో పశువుల అక్రమ రవాణా సాగుతోంది. పోలీసులు పలుమార్లు దాడులు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేసి 22 పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యానును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యానులో ఎనిమిది ఎద్దులు, పదకొండు ఆవులు, మూడు దూడలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట అలమండ సంతకు తీసుకువెళ్లి అక్కడి నుంచి కబేళాకు తరలిస్తున్నట్లు డ్రైవర్ పోతూరు ఆంజనేయులు పోలీసులకు తెలిపాడు.



పశువులను కబేళాకు తీసుకువెళ్తున్న వ్యాను

అక్రమ రవాణాకు కారకుడైన కేదారిపురం గ్రామానికి చెందిన సంతోష్ రౌత్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మణ తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల మధ్య కోర్టు మానిటరింగ్ సిబ్బంది అనుసంధానంగా వ్యవహరిస్తూ అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కోర్టు సిబ్బంది, కోర్టు లైజన్ సిబ్బందితో కోర్టు కేసుల ట్రయిల్ విధానం, వివిధ దశల్లో ఎదరవుతున్న సమస్యలు, సమన్లు, వారెంట్ల అమలు, సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చడం, కేసు అభియోగపత్రాల దాఖలు, ఇతరత్రా విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ సోమశేఖర్, ఎస్ఐ నేతాజీ, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల సర్దుబాటు నిర్ణయం సరికాదు'

శ్రీకాకుళం న్యూ కాలనీ, ఇచ్ఛాపురం రూరల్: టీచర్లను సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.శివరామ్ ప్రసాద్, కీలు సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి, క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలు తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. 117 జీఓ రద్దు చేయాలని, పదోన్నతుల తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 10 కన్నా ఎక్కువ ఉంటే ఇద్దరు టీచర్లను నియమించాలని, సర్దుబాటు చేయడానికి ఉపాధ్యాయులు లేకుంటే అకడమిక్ విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. హిందీ టీచర్లను కూడా నియమించాలని కోరారు.



డీఈఓ తిరుమల చైతన్యకు వినతి పత్రం అందిస్తున్న ఆపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు

ఐటీడీఏ పీఓలతో బంతాట

సాక్షి, పార్వతీపురం మన్యం : సీతంపేట ఐటీడీఏ పీఓకు బదిలీ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురంతో పాటు.. సీతంపేట ఐటీడీఏలున్నాయి. పార్వతీపురం ఐటీడీఏకు సంబంధించి ఎన్నికల సమయం వరకు ఇక్కడ పీఓగా విష్ణుచరణ్ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 20న జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో సేదు మాధవన్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన 20 రోజుల్లోపే ఆయన్ను బదిలీ చేశారు. సేదు మాధవన్‌ను విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీతంపేట ఐటీడీఏ విషయానికొస్తే.. గత ఎన్నికల సమయంలో పీఓగా వ్యవహరించిన కల్పనాకుమారిని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆకస్మాత్తుగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో శుభం బన్సల్‌ను నియమించారు. కొద్దిరోజులకే ఆయన సెలవుపై వెళ్లిపోయారు. చాలా రోజుల పాటు ఇన్‌చార్జి పీఓగా పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ వ్యవహరించారు. గత నెల 20న చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా సీతంపేటకు 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని నియమించారు. తాజాగా జరిగిన బదిలీల్లో రాహుల్‌కుమార్‌రెడ్డిని సైతం పశ్చిమగోదావరి జిల్లా జేసీగా పంపించేశారు. ప్రస్తుతం పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు కొత్తగా ఎవరినీ నియమించకపోవడం విశేషం.

హాస్టల్‌పై కొరవడిన పర్యవేక్షణ



కొళిగాం వసతి గృహం



విద్యార్థులు వినియోగించకపోవడంతో అధ్వానంగా మరుగుదొడ్లు

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం బీసీ బాలుర వసతి గృహంపై పర్యవేక్షణ కొరవడుతోంది. వసతి గృహంలో ఉండని విద్యార్థులను ఉన్నట్లుగా, భోజనం చేయని విద్యార్థులు భోజనం చేస్తున్నట్లుగా రికార్డుల్లో రాసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డులు చూపుతున్నప్పటికీ ఆ వసతి గృహంలో ముచ్చటగా ముగ్గురు విద్యార్థులు కూడా ఉండని పరిస్థితి. ఉదయం పూట విద్యార్థులకు మెనూ ప్రకారం పాలు, ఇడ్లీ, పులిహోర, గోధుమ పూరీలు అల్పాహారంగా ఇస్తున్నట్లు, రాత్రి సమయంలో గుడ్లు, చికెన్, పండ్లు, సెలవు రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఇస్తున్నట్లు రికార్డుల్లో రాస్తున్నారు. కానీ వాస్తవంగా ఆ పరిస్థితి లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బీసీ వసతి గృహాలకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు కావడంతో స్థానిక సిబ్బంది దీన్ని ఉపయోగించుకుంటున్నట్లు వాదనలు ఉన్నాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఈ వసతి గృహాన్ని సందర్శించే అధికారి లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది ఆటలు సాగుతున్నాయని స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **ఇళ్ల వద్దకు వెళ్లి చెప్పినా..**
>
> వసతి గృహాల్లో రాత్రి, పగలు విద్యార్థులు ఉంటే వారికి చక్కనైన భోజనం పెడతామని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి చెప్పినా ఫలితం కనిపించడం లేదు. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు చాలా సార్లు స్వయంగా కలిసి చెప్పడం జరిగింది. అయినా ఇక్కడ ఉండేందుకు ఇష్టపడటం లేదు. ఈ మధ్య నుంచి పదో తరగతి విద్యార్థులకు ట్యూషన్ పెట్టించడంతో ఓ పదిమంది వరకు హాస్టల్‌లో ఉంటున్నారు.
>
> – కాంతారావు, వార్డెన్, బీసీ హాస్టల్, కొళిగాం

మినీ గురుకులం పాఠశాల విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: మండలంలోని కారిగూడలో ఉన్న మినీ గురుకులం పాఠశాలలో 202 మంది గిరిజన బాలికలు చదువుతున్నారు. గురుకులంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు శనివారం ధర్నా నిర్వహించారు. హెచ్‌ఎం సక్రమంగా భోజనాలు పెట్టడం లేదని పలువురు విద్యార్థులు తెలిపారు. భోజనాలు నాణ్యతగా ఉండడం లేదని ఆరోపించారు. ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి అక్కడకు రాగా.. ఆయనకు కూడా ఫిర్యాదు చేశారు. గురుకులంలో బాత్‌రూమ్‌లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. డైనింగ్ హాలు లేక వరండాల మీద భోజనాలు చేయడంతో పాటు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. దీంతో పీఓ పాఠశాలలో ఉన్న సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాల రుచి చూశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎం, పీఓలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. హెచ్‌ఎంను మరో చోటకు పంపిస్తానని పీఓ చెప్పారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు. ఇదే పాఠశాలలో ఈ నెల 8వ తేదీన ఇవే సమస్యలపై విద్యార్థులు గురుకులాన్ని బహిష్కరించి ఇంటికి వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎల్.తులసీవరప్రసాదరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విధుల నుంచి హెచ్‌ఎం తొలగింపు

కొత్తూరు: కారిగూడ గిరిజన గ్రామంలో ఉన్న మినీ గురుకులం పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు హేమలతను విధుల నుంచి సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి శనివారం తొలగించారు. శనివారం కారిగూడలో ఉన్న గురుకుల పాఠశాలను పీఓ పరిశీలించి చర్యలు తీసుకున్నారు. ఐటీడీఏ సీతంపేట కార్యాలయానికి రిపోర్టు చేయమన్నారు. అదే పాఠశాలలో పని చేస్తున్న శ్రీలక్ష్మికు ప్రధానోపాధ్యాయురాలు బాధ్యతలు అప్పగించారు.

క్షేత్ర పాలకా.. నీదే భారమిక

- శ్రీముఖలింగేశ్వరుని క్షేత్ర పాలకుని ఆలయం భద్రతలో డొల్లతనం
- వృథాగా పడి ఉన్న సీసీ కెమెరాలు
- పట్టించుకోని దేవదాయ శాఖ

జలుమూరు:

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం క్షేత్రపాలకుడు విష్ణుమూర్తి ఆలయంలో భద్రతా లోపాలు కనిపిస్తున్నాయి. స్వామివారు కరకవలస గ్రామం సమీపాన అనంత పద్మనాభ కొండపై కృష్ణార్జునుడిగా కొలువై ఉన్నారు. ఇక్కడ స్వామితోపాటు గణపతి, లక్ష్మీదేవి, మహిషాసుర మర్దిని తదితర దేవతా విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ కరకవలస, అనుపురం గ్రామాలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం అభిషేకార్చనలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా ఏటా ధనుర్మాసం నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా భక్తులు స్వామిని దర్శించుకుంటారు. అలాగే సంక్రాంతి తర్వాత కనుమ రోజున ఈ కొండపై స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి పెద్ద జాతర నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిసేవలో తరిస్తారు. ఆదాయం కూడా అధికంగానే ఉంటుంది.





అనంత పద్మనాభ ముఖ ద్వారం, పూజలు అందుకుంటున్న స్వామివారు



కొండపై వినియోగంలోకి రాని సీసీ కెమెరాలు, పరికరాలు

ఇక్కడ 2021లో గుర్తు తెలియని వ్యక్తులు గణపతి, లక్ష్మీదేవి, మహిషాసురమర్దిని తదితర విగ్రహాలు ధ్వంసం చేశారు. అలాగే హుండీ కూడా ఎత్తుకెళ్లారు. దీనిపై అప్పటి ఎస్పీ అమిత్ బర్దార్ స్వయంగా డీఎస్పీ మహేంద్రతో వచ్చి స్వామివారి కొండ, ధ్వంసమైన విగ్రహాలు పరిశీలించి భద్రత పెంచాలని దేవదాయ శాఖాధికారులతో పాటు పోలీసులను కూడా ఆదేశించారు. వీటి కోసం ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని శ్రీముఖలింగంలో దేవదాయ శాఖ కార్యాలయం, అటు జలుమూరు పోలీస్ స్టేషన్‌లో నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. సీసీ కెమెరాలైతే ఏర్పాటు చేశారు గానీ.. వాటిని పర్యవేక్షించే బాధ్యతను మాత్రం పక్కనపెట్టేశారు.

అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, సెటాప్ బాక్స్, విజన్స్, మానిటర్, ఇతర పరికరాలు తదితరవి కొన్ని దొంగలు ఎత్తుకెళ్లగా మరికొన్ని నిర్వహణ లోపంతో పాడైపోయాయి. భద్రత, రక్షణకు ఎంతో ముఖ్యమైన ఈ సీసీ కెమెరాలు ఇలా పాడై నిరుపయోగంగా ఉంటే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎంతో విశిష్టతగల ఈ అనంత పద్మనాభస్వామి కొండపై ఉన్న దేవతా విగ్రహాలను రక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈఓ పి.ప్రభాకరరావును వివరణ కోరగా సీసీ కెమెరాలు పాడై వినియోగంలోకి రాలేదన్నది తమ దృష్టికి వచ్చిందని, దీనిపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సంబంధిత నిపుణులను తెచ్చి మరమ్మతులు చేస్తామని తెలిపారు.



పాడైన సీసీ కెమెరాలు